డబుల్ ట్రీట్ ఇవ్వనున్న 'దేవర'

'దేవర' సినిమా.. అటు తారక్‌కి, ఇటు దర్శకుడు కొరటాల శివకీ నిజంగా పెద్ద టాస్క్. ఎందుకంటే.. రాజమౌళి 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత తారక్ చేస్తున్న సినిమా ఇది. రాజమౌళితో చేసిన సినిమా ఘనవిజయం సాధించడం, ఆ తర్వాత వేరే దర్శకుడితో చేసిన సినిమా ఫ్లాప్ అవ్వడం.. ఇప్పటివరకూ ప్రతి హీరోకీ జరిగిందిదే. రాజమౌళి సినిమా చేసి, ఆ వెంటనే హిట్ కొట్టిన హీరో లేడూ, హిట్ ఇచ్చిన దర్శకుడూ లేడు. అందుకే తారక్, కొరటాల శివలకు 'దేవర' ఓ అగ్నిపరీక్ష. అందుకే.. ఎలాగైనా చరిత్రను తిప్పిరాయాలని, ట్రెండ్‌ని బ్రేక్ చేయాలని కసితో పనిచేస్తున్నారు తారక్, కొరటాల. శరవేగంతో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా గురించి తాజా అప్‌డేట్ ఒకటి వెలుగు చూసింది. ఇందులో కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈమెతోపాటు శృతి మరాటే కూడా మరో కథానాయికగా నటిస్తున్నట్టు తెలిసింది. ఒకే ఎన్టీయార్ పక్కన ఇద్దరు హీరోయిన్లు అనుకుంటే మీరు పొరబడ్డట్టే. ఇందులో తారక్ కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఓ ఎన్టీయార్‌తో జాన్వీ, మరో ఎన్టీయార్‌కి జోడీగా శృతి నటిస్తున్నారట. ఈ ఏడాది జూన్ నుంచి హృతిక్‌రోషన్ 'వార్ 2' చిత్రానికి తారక్ డేట్స్ ఇచ్చారు. అందుకే మే నాటికి ఎన్టీయార్ షూటింగ్ పార్ట్‌ని పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నారు కొరటాల. ఈ ఏడాది ద్వితీయార్ధంలో 'దేవర' విడుదలయ్యే అవకాశం ఉంది.

ప్రపంచం ఎదురుచూస్తోంది..

తెలుగు సినిమాకోసం ప్రపంచం ఎదురుచూసేలా చేసిన దర్శకుడు రాజమౌళి. ఆయన సూపర్‌స్టార్ మహేశ్‌బాబుతో చేయనున్న సినిమాకోసం ప్రపంచమే ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. రచయిత విజయేంద్రప్రసాద్ పలు వేదికలపై ఈ సినిమా గురించి కొత్త కొత్త అప్‌డేట్లు ఇస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపులు చేస్తున్నారు. అమెజాన్ ఫారెస్ట్ నేపథ్యంలో ట్రజర్ హంట్ కథాంశంతో దర్శకుడు రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. ఈ అడ్వంచరస్ డ్రామా గురించి ఇప్పుడిప్పుడే కొత్త కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ సినిమాకోసం మహేశ్ తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకునే పనిలోవున్నారు. రాత్రింబవళ్లూ జిమ్ములోనే గడుపుతూ ఊహించని విధంగా మేకోవర్ అవుతున్నారు. తాజాగా తెలుస్తున్న వార్తేంటంటే.. ఇందులో మహేశ్ పూర్తి గడ్డంతో కనిపిస్తారట. అందుకోసం స్టయిల్‌గా గడ్డంపెంచే పనిలో ఉన్నారు సూపర్‌స్టార్. హాలీవుడ్ ట్రజర్ హంట్ చిత్రాలను తలదన్నేలా ఈ సినిమాను దర్శకధీరుడు తెరకెక్కించనున్నట్టు యూనిట్‌వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. కథతోపాటు మాటలు కూడా విజేంద్రప్రసాదే అందిస్తున్నట్టు తెలిసింది. తెలుగు చలన చిత్ర చరిత్రలో సూపర్‌స్టార్ కృష్ణ నటించినన్ని ట్రజంర్ హంట్ కథలు ఏహీరో నటించలేదన్నది నిజం. ఇప్పుడు తండ్రి బాటలోనే మహేశ్ కూడా ట్రజర్ హంట్ కథతోరానున్నారు. ఇంకా ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

కళాప్రక్రియలను కళాత్మకంగానే చూడాలి

'పురుషాధిక్యత అనే కాన్సెప్ట్ గురించి మాట్లాడటానికి కూడా నేను ఇష్టపడను. స్త్రీని తక్కువ చేసి ఎవరు మాట్లాడినా నేను భరించలేను. అలాంటివాళ్లను చూస్తే నాకు అసహ్యం. అయితే.. కోపం అర్థవంతంగా ఉండాలి. స్పందనలో నిజాయితీ ఉండాలి. మనకు నచ్చిందే కరెక్టని వాదించడం మూర్ఖత్వం అవుతుంది. కళాప్రక్రియలన్నింటినీ కళాత్మకంగానే చూడాలి. కళాకారులకు విశాల దృక్పథం అవసరం' అంటూ తన మనసును ఆవిష్కరించింది భూమీ పెడ్నేకర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'యానిమల్' సినిమాపై వస్తున్న విమర్శలపై ఆమె పై రీతిగా స్పందించింది. ' సందీప్‌రెడ్డి వంగా కథను దృష్టిలో పెట్టుకొని మనం మాట్లాడాలి. కథ అంటే వ్యక్తిత్వాల సమాహారం. అవి విభిన్నంగా ఉంటాయి. దాన్ని మనం కళారూపంగా చూడాలే తప్ప, అదేదో మన సమస్యగా భావించి మాట్లాడకూడదు. తను అనుకున్న వ్యక్తిత్వాలను సందీప్ అద్భుతంగా తెరపై ఆవిష్కరించాడు. ఆ విధంగా అతడ్ని అభినందించాలి. తన నుండి అన్నీ ఇలాంటివే వస్తాయని అనుకోకూడదు. తను మంచి దర్శకుడు. దీనికి భిన్నమైన సినిమా కూడా అతన్నుంచి ఆశించొచ్చు. నా వరకు ఒక నటిగా చెబుతున్నాను. ఇందులో నటించిన నటీనటులందరూ అద్భుతంగా నటించారు. సినిమాను సినిమాగా చూడండి' అంటూ చెప్పుకొచ్చింది భూమి పెడ్నేకర్.

నిలకడగా మిథున్ ఆరోగ్యం

ప్రముఖ బాలీవుడ్ నటుడు, భజాపా నేత మిథున్ చక్రవర్తి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. శనివారం ఉదయం ఆయనకు హటాత్తుగా కుడి చేయి, కుడికాలు బలహీనపడటంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఆయన్ను కోల్‌కతాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మిథున్ ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఎంఆర్ఐ స్కాన్ రిపోర్ట్ ప్రకారం మిథున్ మెదడులో ఇస్కిమిక్ సెరెబ్రో వాస్కులర్ అనే స్ట్రోక్ ఏర్పడిందని, ఈ కారణం వల్లే ఆయన కుడి చేయి, కుడి కాలు బలహీనపడ్డాయని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం మిథున్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆహారం కూడా తీసుకుంటున్నారని వైద్యులు తెలియజేశారు. 1976లో 'మ్రిగయా' అనే బెంగాలీ చిత్రం ద్వారా మిథున్ తెరంగేట్రం చేశారు. తొలి సినిమాతోనే ఉత్తమనటుడిగా పలు అవార్డులు అందుకున్నారు. 1982లో విడుదలైన 'డిస్కోడాన్సర్' ఆయనకు సూపర్‌స్టార్‌డమ్ తెచ్చిపెట్టింది. ఇటీవలే పద్మభూషణ్ అవార్డు కూడా అందుకున్నారు మిథున్‌చక్రవర్తి.

శివ కందుకూరి, రాశిసింగ్, విశ్వక్‌సేన్

దిష్టిబొమ్మ హత్యల కథ

శివ కందుకూరి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించారు. మార్చి 1న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ట్రైలర్‌ను యువ హీరో విశ్వక్‌సేన్ ఆవిష్కరించారు. 'ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు సమీపంలో మునుపెన్నడూ చూడని దారుణ హత్య జరిగింది. ఆ హత్యలను దిష్టిబొమ్మ హత్యలుగా పోలీసులు పేర్కొన్నారు' అనే న్యూస్ బులెటిన్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఎలాంటి క్లూ వదలకుండా హత్యలు చేసే ఓ సీరియల్ కిల్లర్ కేసుని డిటెక్టివ్ భూతద్ధం భాస్కర్ ఎలా పరిష్కరించాడన్నదే కథాంశమని, అనేక మలుపులతో సాగుతుందని దర్శకుడు తెలిపారు. పురాణాలతో ముడిపడిన ఎలిమెంట్స్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతాయని హీరో శివ కందుకూరి తెలిపారు. విభిన్నమైన థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుందని నిర్మాతలు పేర్కొన్నారు. రాశిసింగ్ అరుణ్‌కుమార్, దేవిప్రసాద్, వర్షిణి సౌందరరాజన్, శివకుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: గౌతమ్ జార్జ్, సంగీతం: శ్రీచరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్, నిర్మాతలు: స్నేహల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముడుంబై, దర్శకత్వం: పురుషోత్తం రాజ్.

పాల పిట్టల్లె ప్రేమే వాలె..

చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి (అక్షర) దర్శకుడు. త్వరలో థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలోని 'పాల పిట్టల్లె ప్రేమే వాలె..' అనే పాటను ప్రముఖ దర్శకుడు దేవ కట్టా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన సినిమా కంటెంట్ చాలా కొత్తగా ఉందన్నారు. తెలంగాణ సాహిత్యంతో వెస్ట్రన్ స్టైల్‌లో కంపోజ్ చేసిన గీతమిదని దర్శకుడు కుమారస్వామి తెలిపారు. హీరో చైతన్య రావు మాట్లాడుతూ 'జనం మాట్లాడుకునే భాషలో అద్భుతమైన ఫిలాసఫీ కలబోసిన పాట ఇది. మల్లెగోడ గంగప్రసాద్ అద్భుతమైన సాహిత్యాన్నందించారు. అరుణ్ చిలువేరు క్యాచీ ట్యూన్ సమకూర్చారు' అన్నారు. ఈ పాటలో చిన్న చిన్న పదాలతోనే ప్రేమతత్వాన్ని చెప్పే ప్రయత్నం చేశానని గీత రచయిత మల్లెగోడ గంగాప్రసాద్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ వనమాలి, శేఖర్ పోచంపల్లి, సంగీతం: అరుణ్ చిలువేరు, సురేష్ బొబ్బిలి, సంభాషణలు: పెద్దింటి అశోక్‌కుమార్, రచన-దర్శకత్వం: కుమారస్వామి (అక్షర).

విభిన్న కథతో 'చౌర్యపాఠం'

ఇంద్రరామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'చౌర్యపాఠం'. నిఖిల్ గొల్లమారి దర్శకుడు. నక్కిన త్రినాథ రావు నిర్మాత. శనివారం ఫస్ట్‌లుక్, టీజర్‌ను లాంచ్ చేశారు. క్రైమ్ కామెడీ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గ్రామంలో దోపిడీ కోసం తన ముఠాను హీరో సన్నద్ధం చేసే సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. స్టైలిష్ మేకింగ్, కామెడీ అంశాలతో ఆకట్టుకుంది. ఈ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని అద్భుతమైన కథనందించాడని, ప్రతిభావంతులైన టీమ్‌తో రూపొందించామని నిర్మాత నక్కిన త్రినాథ రావు తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'రాబరీ నేపథ్యంలో సాగే కథాంశమిది. ఆద్యంతం ఉత్కంఠ, వినోదంతో సాగుతుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చందూ మొండేటి, వివేక్ కూచిభొట్ల, కోనేరు సత్యనారాయణ, మిర్యాల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాయల్ రాధాకృష్ణ, రాజీవ్ కనకాల, మస్త్ అలీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, సంగీతం: డేవ్‌జాంద్, నిర్మాణ సంస్థ: నక్కిన నరేటివ్స్, దర్శకత్వం: నిఖిల్ గొల్లమారి.

ఆధ్యాత్మిక ప్రయాణం నన్ను మార్చింది

'నాకు ఆత్మన్యూనతాభావం ఎక్కువ. నాగురించి నేను తక్కువగా ఊహించుకోవడం చిన్నప్పట్నుంచీ అలవాటు. అయితే నా ఆధ్యత్మిక ప్రయాణం నాలో మార్పును తీసుకొచ్చింది' అంటున్నది బాలీవుడ్ భామ మౌనీరాయ్. టీవీ సీరియల్స్ నటిగా కెరీర్ ప్రారంభించిన మౌనీ.. అక్షయ్‌కుమార్ 'గోల్డ్' సినిమాతో వెండితెరకు పరిచయం అయ్యింది. ప్రస్తుతం ఇమ్రాన్ హష్మి కథానాయకుడిగా రూపొందుతోన్న 'షో టైమ్' సినిమాలో నటిస్తున్నారామె. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మౌని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'నా గురించి నేను తక్కువగా ఊహించుకోవడం తప్పని నా ఆధ్యత్మిక ప్రయాణం నాకు ప్రభోదించింది. ఈ ప్రయాణం ద్వారా నా గొప్పతనం నాకు తెలిసింది. మనల్ని మనం ప్రేమించుకోవాలి, గౌరవించుకోవాలి. అలా చేయకపోతే సమాజం కూడా మనల్ని అంగీకరించదు. ఈ విషయం ధ్యానం ద్వారా నాకు తెలిసివచ్చింది.' అన్నారు మౌనీ రాయ్. తనను ఈ స్థాయిలో నిలబెట్టిన టీవీని ఎప్పటికీ మరువనని, అనుకోకుండా తలపు తట్టిన అపూర్వ అవకాశం 'గోల్డ్' మూవీ అని, అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించడం మరిచిపోలేని అనుభవమని మౌనీ ఆనందం వెలిబుచ్చింది. లెక్కలేనన్ని సినిమా ఆడిషన్స్‌కి అటెండ్ అయ్యానని, కానీ అవకాశాలు మాత్రం వచ్చేవి కావని, సినిమా పరిశ్రమ అంటే ఇలానే ఉంటుందని సరిపెట్టుకునేదాన్నని, ఇప్పుడు వద్దన్నా అవకాశాలు వస్తున్నాయని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు మౌని

విమర్శలకు బాధపడను

2009 నుంచి 2019వరకూ ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయపరిస్థితులు, వైఎస్ జగన్ పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'యాత్ర2'. వైఎస్ రాజశేఖరరెడ్డిగా మలయాళ అగ్రనటుడు మమ్ముట్టి నటించగా, వైఎస్ జగన్మోహనరెడ్డి పాత్రలో తమిళ నటుడు జీవా నటించారు. మహి.వి.రాఘవ రూపొందిన ఈ చిత్రం గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా ఇటీవల సక్సెస్‌మీట్‌ని చిత్రబృందం నిర్వహించారు. 'ఇది రాజకీయనాయకుడి మీద తీసిన సినిమా కాబట్టి కొందరికి నచ్చింది. ఇంకొందరికి నచ్చలేదు. ఎవరి అభిప్రాయాలను వారు పంచుకున్నారు. రివ్యూల రూపంలోకూడా. సినిమా తీయడం నా బాధ్యత. విమర్శలకు నేనేమీ బాధపడను. తండ్రీకొడుకుల కథ తీయాలని 2019లోనే నిర్ణయించుకున్నా. కథకు తగ్గట్టుగా పాత్రలు కుదిరాయి. ఇందులో కొన్ని పాత్రలు లేవేంటని కొందరు అడుగుతున్నారు. నా కథకు తగ్గట్టే పాత్రలు పెట్టాను. జగన్ ఇంకా ఈ సినిమా చూడలేదు. త్వరలో చూస్తారు. నంద్యాల బై ఎలక్షన్ సీన్ తీసి, ఎడిటింగ్‌లో తీసేశాను. సినిమా విడుదలై ఒక్కరోజే అయ్యింది. సోమవారంకానీ రియాలిటీ తెలియదు. సంగీతం, విజువల్స్, డైలాగ్స్ అన్నింటికీ మంచి స్పందన వస్తున్నది. త్వరలోనే మా నుంచి 'సేవ్ ది టైగర్స్ 2' రాబోతున్నది. నేను కథ రాయడానికి సమయం ఎక్కువ తీసుకుంటాను. కాస్త బ్రేక్ తీసుకొని తర్వాత సినిమా గురించి చెబుతా' అన్నారు మహి.వి.రాఘవ.

తొలిముద్దు జ్ఞాపకాల్లో..

దిలీప్‌ప్రకాష్, రెజీనా కసాండ్రా జంటగా నటిస్తున్న చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వ వహిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ పాటిల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని తొలి గీతం 'ఫస్ట్‌కిస్' శనివారం విడుదలైంది. అనూప్‌రూబెన్స్ స్వరపరచిన ఈ పాటను అనంత్‌శ్రీరామ్ రచించారు. తొలిముద్దు తాలూకు అనుభూతులను వ్యక్తం చేస్తూ ఈ పాట చక్కటి సాహిత్యంతో సాగింది. రామ్‌మిరియాల తనదైన శైలిలో ఆలపించారు. 'ప్రేమ, వినోదం, భావోద్వేగాల కలబోతగా సాగే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. ఫీల్‌గుడ్ లవ్ స్టోరీగా మెప్పిస్తుంది. కథానుగుణంగా సంగీతానికి ప్రాధాన్యత ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ప్రకాష్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: అనూప్ రూబెన్స్, రచన-దర్శకత్వం: అర్జున్ సాయి.